క్లుప్తంగా

క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు (టౌన్): నగరంలోని పార్థసారథి నగర్‌లోని గీతాంజలి పీజీ కళాశాలలో జెనెక్స్ విజన్ అకాడమి అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించారు. హెక్స్‌వేర్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన హెక్స్‌వేర్ హెచ్‌ఆర్ విజయ్, టాలెంట్ అక్విజేషన్ హెడ్ అజీరా టోనీ ఎంపికలు చేపట్టారు. డిగ్రీ పూర్తి చేసిన 300మందికి పైగా విద్యార్థులు హాజరవగా, 82 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జెనెక్స్ విజన్ కళాశాల చైర్మన్ వెంగళరెడ్డి, డైరెక్టర్ కొండలరావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులరెడ్డి, అనిల్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఘనంగా ఫెమ్ ఫెస్ట్



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్స్ ఫోరం ఆధ్వర్యంలో వన్ డే నేషనల్ లెవల్ ఫెమ్ ఫెస్ట్ (ఫెమ్‌స్ప్లాష్- 2కె23)ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సోలో డ్యాన్స్, గ్రూపు డ్యాన్స్, ఫ్యాషన్ షో, కుకింగ్ విత్ అవుట్ ఫైర్, పోస్టర్ ప్రజంటేషన్, ఫ్యాన్సీ డ్రస్, అంత్యాక్షరి, సింగింగ్, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ ఆస్పత్రి ఎండోక్రినాలజీ హెచ్‌ఓడీ సునంద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విజ్ఞానంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మంచి ఆరోగ్యం భవిష్యత్తుకు దోహదపడుతుందన్నారు. క్యాప్ జెమినీ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫైనాన్స్ సర్వీసు డైరెక్టర్ మమతా షణ్ముగం మాట్లాడుతూ పనిపట్ల అంకిత భావం కలిగి ఉండి చేసే పనిని ప్రేమించే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, ఈవెంట్ కన్వీనర్ సునీత, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

అపోలో యూరాలజిస్ట్‌కు ఆసియా బుక్‌లో చోటు



నెల్లూరు సిటీ: నగరంలోని అపోలో ఆస్పత్రి యూరాలజిస్ట్ పీ వేదమూర్తిరెడ్డి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నగరంలోని అపోలో ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరామ్‌సతీష్ వెల్లడించారు. 2021లో 46 ఏళ్ల రోగి శరీరంలో కుడి పక్కన అడ్రినల్ గ్రంథిలో ఉన్న 13 సెంటీమీటర్ల మైలోలిపోమా అనే పెద్ద కణితిని ఎలాంటి కోత లేకుండా లాప్రోస్కోపీ ద్వారా విజయవంతంగా డాక్టర్ వేదమూర్తిరెడ్డి తొలగించారని తెలిపారు. 13 సెంటీమీటర్ల కణితిని దక్షిణ భారతదేశంలో ఇప్పటి వరకు లాప్రోస్కోపీ ద్వారా ఎవరూ తొలగించలేదని చెప్పారు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఈ ఏడాది ఆగస్టు 24న నిర్ధారణ చేసి ధ్రువపత్రాలతో పాటు అవార్డు అందజేశారని పేర్కొన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధులు కూడా ధ్రువపత్రం, అవార్డు అందచేశారని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదమూర్తిరెడ్డికి అపోలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ ఆదాల చొరవతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 19వ డివిజన్‌లోని శ్రీహరినగర్ ప్రధాన రహదారి సమస్యను గడప గడపకు కార్యక్రమంలో ఎంపీ ఆదాలకు విన్నవించగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. కానీ స్థానిక కార్పొరేట్ భర్త, టీడీపీ నాయకుడు మదన్‌మోహన్‌కుమార్‌రెడ్డి తమ చొరవతోనే పనులు జరుగుతున్నాయని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అసత్య ప్రచారాలు చేసుకుంటున్న వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు వలంటీర్ సేవలు

- ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్ నియామకం
- వ్యవసాయంలో అన్నదాతలకు సహకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు



కోవూరులోని రైతుభరోసా కేంద్రం

కోవూరు : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లు ఇప్పుడు రైతుభరోసా కేంద్రాలకు అనుబంధంగా పనిచేయనున్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా రైతుభరోసా కేంద్రాల్లో నిరంతర సేవలు అందే అవకాశం ఏర్పడింది. వలంటీర్ల రాకతో ఆర్బీకేలు రైతులకు మరింత చేరువ కానున్నారు. ముఖ్యంగా పంట దిగుబడులు వచ్చాక విక్రయానికి రైతుల అవస్థలను గుర్తించి ధాన్యం కొనుగోలులో వలంటీర్ల సేవలను వినియోగించుకునేలా ప్రణాళికలు తయారు చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే ఆలోచనతో ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రాల్లో వ్యవసాయ పంటల సాగు ఆధారంగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరీకల్చర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. వీరే ఆర్బీకే ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరంతా ఎక్కువ సమయాన్ని క్షేత్రస్థాయిలో గడపాల్సి వస్తోంది. ప్రధానంగా పంటల సాగు సమయంలో ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ కోసం రోజుల తరబడి పంట పొలాల్లో ఉండాల్సి వస్తోంది. దీంతోపాటు వారంలో ఒక రోజు పొలంబడి కార్యక్రమం నిర్వహించాలి. వీటితోపాటు మండల, సబ్ డివిజన్, జిల్లా స్థాయిల్లో నిర్వహించే సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాల్సిఉంది. ఇలాంటి సమయాల్లో రైతుభరోసా కేంద్రాల్లో ఉండే అవకాశం లేదు. రైతులకు ఈ సమస్య కూడా ఉండకూడదని భావించి సమస్య పరిష్కారానికి ప్రతి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వలంటీర్ల ఎంపిక

జిల్లాలో మొత్తం 561 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో 544 ఉండగా, అర్బన్ ప్రాంతాల్లో 17 ఉన్నాయి. వలంటీర్లకు ఆర్థిక నిర్వహణపై, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై శిక్షణ కూడా ఇచ్చారు. విత్తనాల పంపిణీ, డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు ఆర్డర్ పెట్టడం, పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు ఆర్బీకే ఇన్‌చార్జి పర్యవేక్షణలో వలంటీర్లు చేపడతారు. వలంటీర్లు నేరుగా రైతు వద్దనే ధాన్యం సేకరించి వారికి మద్దతు ధర అందించేలా చర్యలు తీసుకుంటారు.



రైతులకు అందుబాటులో ఉన్న ఎరువులు (ఫైల్)

దేశానికే రోల్ మోడల్‌గా ఆర్బీకేలు

గ్రామస్థాయిలో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు కావడంతో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. విత్తన ఎంపిక నుంచి పంట విక్రయం వరకు అన్నిసేవలు సొంత గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా అందుతున్నాయి. దీంతో అవి దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. తాజాగా ప్రతి ఆర్బీకేకు వలంటీర్‌ను నియమించడంతో మరో విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంది. గతంలో ప్రైవేటు డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఎమ్మార్పీపై రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేసేవారు. ఆర్బీకే వల్ల ప్రైవేటు డీలర్ల అక్రమాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయి. తాజాగా వలంటీర్ల నియామకంతో మరింత మెరుగైన సేవలు అందనున్నాయి.


జిల్లాలో..

మొత్తం రైతుభరోసా కేంద్రాలు	561
గ్రామీణ ప్రాంతాల్లో	544
పట్టణ ప్రాంతాల్లో	17

అందిస్తున్న సేవలు

వ్యవసాయశాఖలో	28
ఏటీఎంఏపీలో	06
మత్స్యశాఖలో	10
ఉద్యానశాఖలో	6
పశుసంవర్థకశాఖలో	11
పట్టు పరిశ్రమశాఖలో	08

శుభపరిణామం



ప్రతి ఆర్బీకేకు వలంటీర్‌ను నియమించడం శుభ పరిణామం. దీంతో రైతులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచడం మంచినిర్ణయం. వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వచ్చి పంటలను చూసి సూచనలు, సలహాలు ఇవ్వడంతో మేలు జరుగుతోంది.

– రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సొసైటీ చైర్మన్, పడుగుపాడు

గొప్ప ఆలోచన



రైతుల మేలు కోసం ఆర్బీకేలో ఒక వలంటీర్‌ను నియమించడం గొప్ప ఆలోచన. వ్యవసాయ గ్రామ సహాయకులు ఏదైనా పనుల నిమిత్తం బయటకు వెళ్తే రైతులు ఇబ్బందులు పడుతారనే సమస్యను ముందుగా గుర్తించి ఆర్బీకేకు ఒక వలంటీర్‌ను నియమించడం ఒక మంచి నిర్ణయం. రైతుల సమస్యలను గుర్తించి వలంటీర్‌ను నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీసీఏబీ చైర్మన్, నెల్లూరు

వలంటీర్లకు సమగ్ర శిక్షణ



జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో వలంటీర్ల నియామకం పూర్తయింది. వారికి ఆర్బీకే నిర్వహణపై సమగ్ర శిక్షణ కూడా ఇస్తాం. ఆర్బీకే ఇన్‌చార్జిలు క్షేత్రస్థాయిలో వెళ్లిన సమయంలో రైతులకు వలంటీర్లే అన్ని సేవలు అందించాల్సి ఉంటుంది.

– జి.సుధాకర్‌రాజు, జేడీ, నెల్లూరు

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డిని వైఎస్సార్‌టీఎఫ్ నూతన జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ అభినందించారు. జిల్లాలో వైఎస్సార్‌టీఎఫ్‌ను బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నారాయణరాజు, ప్రధాన కార్యదర్శి మునీర్‌జాన్‌కు సూచించారు. వైఎస్సార్‌టీఎఫ్ ట్రెజరర్ యానాదిరెడ్డి, రాష్ట్ర నాయకులు వాసు, శివశంకరరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం



అశ్వత్‌నారాయణుని కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లోని భవాన్ వెంకయ్యస్వామి మందిరంలో ఆరాధనోత్సవాలు శనివారం ఆరంభమయ్యాయి. తొలిరోజు గణపతిపూజ, గణపతి హోమం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకయ్యస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం అశ్వత్ నారాయణుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం భజనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం నీరదమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

పొదలకూరు: మేజర్ పంచాయతీ పొదలకూరులో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరుసగా ఆరో రోజు శనివారం ఒకటో వార్డులో పారిశుద్ధ్య పనులను ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్ పర్యవేక్షించారు. వార్డుల వారీగా రెండు నెలలపాటు పంచాయతీలో పారిశుద్ధ్య పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మురుగు కాలువల్లో పూడిక తొలగింపుతోపాటు వీధుల్లో పిచ్చిమొక్కలు తొలగించి చెత్తాచెదారాన్ని ఊరికి దూరంగా తరలించనున్నట్లు తెలిపారు. తద్వారా దోమలు తగ్గే అవకాశం ఉందన్నారు.



ఒకటో వార్డులో జేసీబీతో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఇందుకూరుపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇందుకూరుపేట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో దసరా వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శాంతయ్య తెలిపారు. తొలిరోజు ఆదివారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా కటాక్షించనున్నారని తెలిపారు. అలాగే ఇందుకూరుపేట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యులు తెలిపారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారు ప్రత్యేక అలంకరణల్లో వివిధ రూపాల్లో దర్శనమిస్తారని, భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపాకటాక్షాలు పొందాలని తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్

- నలుగురికి గాయాలు

వెంకటాచలం: ఆటోను బైక్ ఢీకొని నలుగురు గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు వద్ద శనివారం రాత్రి జరిగింది. ఈదగాలి గ్రామానికి చెందిన నాసిన రమణయ్య, మరికొందరు ఆటోలో దైవదర్శనం కోసం గొలగమూడికి బయలుదేరారు. ఆటో తిక్కవరప్పాడు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా, తిక్కవరప్పాడు వైపు నుంచి మొలకలపూడికి వెళుతున్న బైక్ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మొలకలపూడి గ్రామానికి చెందిన అర్జున్, వెనుక కూర్చున్న వెంకటేష్‌లకు గాయాలయ్యాయి. వీరిలో అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న నాసిన రమణయ్య, ఆటో డ్రైవర్ కిష్టయ్యలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్సనిమిత్తం సర్వేపల్లికి తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో ముందుభాగం

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

నెల్లూరు సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఎక్కడైనా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని పీసీ అండ్ పీఎన్‌డీటీ జిల్లా ప్రోగ్రాం అధికారులు బీ శ్రీనివాసరావు, కే కనకరత్నం తెలిపారు. నగరంలోని రాఘవేంద్ర, సరస్వతి స్కాన్ సెంటర్లు, సాయిపథం, వెంకటరమణ ఆస్పత్రుల్లో శనివారం వారు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్కానింగ్ సెంటర్లలో రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫామ్ ఎఫ్‌లను క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్కానింగ్ సెంటర్లలో పోస్టర్లను ప్రదర్శించాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహా కమిటీ సభ్యులు ఐ శ్రీనివాసరావు, కుసుమకుమారి, కవితారెడ్డి పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

నిత్యం తాగునీటి సరఫరాకు కసరత్తు

- గుర్రాపు బావికి కండలేరు జలాలు
- తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

పొదలకూరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డు, రామమందిరం, సాయిబాబా మందిరం వీధి, మారుతీనగర్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం ఇందుకోసం పైపులైన్లకు మరమ్మతులు కూడా చేపట్టింది. పొదలకూరులో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులకు ఉన్న పైపులైన్‌ను వేరు చేసి ట్యాంకులను నింపి ఒక్కొక్క ట్యాంకు ద్వారా ఒక్కొక్క ప్రాంతానికి తాగునీటిని సరఫరా చేయాలని, ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకూడదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పంచాయతీ నిర్వాహకులు పైపులైన్ రిపేర్లు చేయించి ప్రాంతాల వారీగా తాగునీరు విడుదల చేస్తున్నారు. రెండు ట్యాంకుల సామర్థ్యం 2.20 లక్షల లీటర్లు ఉంటుంది. అయితే నిత్యం ఈ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్న ప్రాంతాలకు 3.50 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుంది. ఈ నేపథ్యంలో పొదలకూరు ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

గుర్రాపు బావికి కండలేరు జలాలు

పొదలకూరు పట్టణ అవసరాల కోసం కండలేరు సీపీడబ్ల్యూ స్కీమ్ ద్వారా పట్టణానికి సమీపంలోని గుర్రాపు బావిని నింపి అందులో నుంచి విద్యుత్ మోటార్ల ద్వారా వాటర్ ట్యాంకులకు, అనంతరం పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అంతేకాకుండా పట్టణంలోని కొన్ని ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం పొట్టేళ్ల కాలువ వద్ద కొత్త బోర్ల నిర్మాణం చేపట్టారు.



పొదలకూరులోని రక్షిత మంచినీటి ట్యాంకులు

తాగునీటి ఇబ్బందులు లేవు



పొదలకూరు పట్టణంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కండలేరు ఏటి కాలువ నుంచి ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తే నిత్యం మంచినీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది.

– కె.కసనానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పొదలకూరు

దౌర్జన్యంగా పొలం దున్నడంపై ఫిర్యాదు

వెంకటాచలం: నెల్లూరు సుబ్బమ్మ, ఆమె కుమారుడు దౌర్జన్యంగా తన పొలాన్ని దున్నించారని మండలంలోని ఎగువమిట్ట గ్రామానికి చెందిన నెల్లూరు శ్రీనివాసులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎగువమిట్ట గ్రామానికి చెందిన నెల్లూరు శ్రీనివాసులు తన తండ్రి వెంకటసుబ్బయ్య వద్ద 2008 సంవత్సరంలో ఒక ఎకరా పొలాన్ని కొనుగోలు చేశారు. అదే గ్రామానికి చెందిన సుబ్బమ్మ, ఆమె కుమారుడు తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, దుక్కి దున్నించి నష్టపరిచారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి వినతి

నెల్లూరు రూరల్: ముత్తుకూరురోడ్డులోని పార్థసారథినగర్‌లో బీటీ రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు నగరంలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక కార్పొరేటర్‌కు సూచించారు. స్థానికులు భాస్కర్‌రెడ్డి, వెంగళరెడ్డి, విజయరామిరెడ్డి, షణ్ముఖఆచారి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పర్పుల్‌వ్యాలీ'లో దసరా సంబరాలు

నెల్లూరు (టౌన్): రవీంద్రనగర్‌లోని పర్పుల్ వ్యాలీ స్కూల్‌లో దసరా సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూరల్ రిట్రీట్ పేరుతో పల్లెటూరు వాతావరణంలో పర్పుల్‌వ్యాలీ గ్రామాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో పశువుల పాక, కుండల తయారీ, పక్షులు, జంతువులు, ఆ కాలంనాటి చిరుతిండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మారుతీదేవి హాజరై మాట్లాడుతూ పల్లెటూరి ప్రకృతి, పశుసంపద వాటి విలువలను పిల్లలకు తెలియజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ఆదరించండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ప్రస్తుతం ఎనలేని విధంగా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్లో గల వైఎస్సార్‌నగర్‌లో రూ.కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శనివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను కోట్లాది రూపాయలతో చేపట్టామని వివరించారు. వైఎస్సార్‌నగర్ అభివృద్ధికి మరో రూ.1.5 కోట్లు మంజూరుకు చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని చెప్పారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి.. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన దరిద్రమని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, కార్పొరేటర్ కూకాటి ప్రసాద్‌రావు, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి